సంపుటి : 13 | సంచిక : 4

మే-జూన్ 2025

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

పరలోక రాజ్యము సమీపించియున్నది,
మారుమనస్సు పొందుడి....





# “మనస్సులోని మాట”

**దేవుని స్పర్శ పాఠకులైన మీ అందరికీ శుభములు.**

మీరంతా దేవుని కృపవలన బాగానే ఉన్నారని భావిస్తున్నాను. ఎండ వేడిమి చాలా అధికముగా ఉండే ఈ మే నెలలో మీరందరు, ముఖ్యంగా చిన్నపిల్లలు, పెద్దవయసులో ఉన్నవారి విషయంలోను చాలా జాగ్రత్తగా ఉండమని మనవి చేస్తున్నాను. అయితే ప్రభువైన యేసుక్రీస్తును విశ్వసించి ఆయన మార్గములో వెళ్తున్న మనం మందిరాలకు వెళ్ళినప్పుడు లేక యూట్యూబ్‌లోను లేక టీవిలోను ఎన్నో వాక్యాలు, ప్రసంగాలు వింటూ ఉంటాము, ఇక మ్యాగజైన్స్, పుస్తకాలు చదువుతూ ఉంటాము. మనం వినే ప్రసంగాలు, రకరకాల సందేశాలు, చదివే అనేక పుస్తకాలు లేక సాక్ష్యాలు మన జీవితాన్ని ప్రభువుకి మహిమ తెచ్చే విధంగా ఉండాలి. అంటే మన జీవితాన్ని ఎవరైనా చూచినప్పుడు మనమాటలు, పనులు, ఆలోచనా విధానం ఎంతో విలువలతో కూడినదై ప్రభువును మహిమపరిచే విధంగా ఉండాలి. ఉదాహరణకి సమాజంలో మన చుట్టూ దేవునిని ఎరుగని వారు ఎక్కువమంది, ఎరిగినవారు తక్కువమంది (మైనారిటీస్)గా ఉంటాం. ప్రభువును ఎరుగనివారి జీవనవిధానానికి, మన జీవనవిధానానికి వ్యత్యాసమనేది లేకపోతే అనగా ఇప్పుడు నీవు విలువలతో బ్రతుకకుండా యేసుప్రభువుని నమ్ముకో చాలా మంచి దేవుడు అని చెబితే మనకంటే వాళ్ళే విలువలతో ఉంటే గనుక ఏంటి వీళ్ళ దేవుడు మంచి, వీళ్ళ జీవితం చూస్తే అర్థం కావట్లేదా అని మనసులో ఆలోచనగలవారై ఏమాత్రం ముందుకు రావడానికి ఇష్టపడరు. అదే మన యొక్క జీవితం ఉన్నతమైన విలువలతో, క్రమశిక్షణతో వారి కంటే బెటర్‌గా కనబడుతూ ఉంటే ఖచ్చితంగా వాళ్లకు ఒక ఆలోచన కలుగుతుంది. నేను కూడా అలాంటి ప్రవర్తన, జీవనవిధానాన్ని కలిగి ఉండాలి అనే ఒక ఆసక్తి ప్రారంభమవుతుంది. ఎవరైతే ఆసక్తి కలిగి ఆయనను వేడుకుంటారో అప్పుడు ప్రభువు వారికి మారుమనస్సుని రక్షణను దయచేసి వారిని కూడా తన కుమారులుగా, కుమార్తెలుగా మార్చుకుంటారు. కాబట్టి ఈ భూమిమీద మనం జీవించే కొద్దికాలంలో మనలో ప్రతి ఒక్కరూ కూడా ఇట్టి అవగాహనతో బ్రతకాలని నేను నా మనసులో మాటని ఈ మే, జూన్ నెల మ్యాగజైన్ ద్వారా మీకు తెలియపరుస్తున్నాను. తప్పకుండా మనలో ప్రతి ఒక్కరికి దేవుడు అట్టి కృప దయచేయాలి. దీనికి స్పష్టమైన దేవుని యొక్క వాక్య ఉదాహరణ ఏమిటంటే “మీరు లోకానికి వెలుగు... మీరు లోకానికి ఉప్పు” అన్నాడు. అంటే ఖచ్చితంగా పైన మనం మాట్లాడుకున్న సంగతులు మన జీవితంలో నెరవేరాలి.

**అట్టి భాగ్యన్ని ప్రభువు దయచేయును గాక!**

మీ సహోదరుడు.....

సంపుటి: 13 | సంచిక: 4

మే-జూన్ 2025

దేవుని

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- దేవుని రాకడ కొరకు నిరీక్షణ ........ 2
- ఆరోగ్య విభాగము ........ 7
- అమ్మ (స్త్రీల ప్రత్యేకము) ........ 8
- జాన్ వెస్లీ -32వ భాగం ........ 11
- ఆశయం (బాలలశీర్షిక) ........ 13
- నా జీవితంలో దేవుడు చేసిన మేలులు ........ 15
- హతసాక్షులు ........ 17
- మనస్తత్త్వ విధానములు ........ 20
- దైవచిత్తాన్వేషణ (తెలుగు) ........ 22
- Finding Gods Will (english) ........ 24
- బైబిల్ క్విజ్ -100 ........ 26
- జన్మదిన శుభాకాంక్షలు ........ 27


మా చిరునామా :

ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,

భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227

**మాట ఇవ్వటానికి తొందరపడకు. ఇచ్చిన మాటను నిలుపుకోవడానికి ఆరాటపడు.**

# దేవుని రాకడ కొరకు నిరీక్షణ

బ్రదర్. ఎపఫ్రా

**"భూమికి తీర్పు తీర్చుటకై నీతినిబట్టి లోకమునకు తీర్పు తీర్చుటకై న్యాయమునుబట్టి జనములకు తీర్పు తీర్చుటకై యెహోవా వేంచేసియున్నాడు. కీర్తన 98:9**

ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకమునకు తీర్పు తీర్చడానికి రాబోతున్నాడు అని ఆయన రాకడ కొరకు సిద్ధపడి, ముందుకి సాగాలి అనే విషయం మీదే క్రైస్తవ విశ్వాస నిరీక్షణ ఆధారపడి ఉంది.

**"భూజనులకు తీర్పు తీర్చుటకై యెహోవా వేంచేయుచున్నాడు న్యాయమునుబట్టి లోకమునకు తన విశ్వాస్యతను బట్టి జనములకు ఆయన తీర్పు తీర్చును". కీర్తన 96:13**

ఆయన తీర్పు జరిగినప్పుడు ఆ తీర్పులో రక్షింపబడినవారమై, నిత్యజీవంవైపు ఉండాలి కాని నిత్య నరకం, నశించిపోయే వైపు కాదు అని ఎరిగి నీ జీవితాన్ని కొనసాగిస్తున్నావా? లేక కొన్ని దశాబ్దాలుగా దేవునిని నమ్ముకొని కూడా, అందరికీ అభ్యంతకరమైన మాటలతోను, ఇతరులను మోసం చేసే పనులతోను కొనసాగుతూ ఉంటే, ఆయన వచ్చినప్పుడు నీ స్థానం ఎక్కడ? నీతి నుండి మరింత నీతివైపు, న్యాయం నుండి మరింత న్యాయంవైపు, మంచి నుండి మరింత మంచివైపుకి ప్రయాణం చేయాలి కానీ చెడు, అవినీతి, అన్యాయం, మోసం లోనికి దిగజారిపోయేది క్రైస్తవ్యం కాదు.

**"మన దేవుడు వేంచేయుచున్నాడు ఆయన మౌనముగా నుండడు. ఆయన ముందర అగ్ని మండుచున్నది ఆయనచుట్టు ప్రచండవాయువు విసరుచున్నది. ఆయన తన ప్రజలకు న్యాయము తీర్చుటకై-బల్యర్పణచేత నాతో నిబంధన చేసికొనిన నా భక్తులను నా యొద్దకు సమకూర్చుడని మీది ఆకాశమును భూమిని పిలుచుచున్నాడు. దేవుడు తానే న్యాయకర్తయై యున్నాడు. ఆకాశమును ఆయన నీతిని తెలియజేయుచున్నది." కీర్తన 50:3-6**

ఆయన తీర్పు కొరకు మానవాళి అంతా ఆయన యెదుట నిలబడే రోజు ఒకటి ఉంది. ఆ రోజు ఆయన మనుష్యులను 2గుంపులుగా విభజిస్తాడు. మారుమనస్సు పొంది, రక్షింపబడి, ఆయన ఏర్పరచుకున్న వారు ఒక గుంపు, యుగయుగములు సాతానుతో నిత్య అగ్ని గుండములో ఉండడానికి సిద్ధపడిన వారు ఇంకొక గుంపు. ఇప్పటికిప్పుడు ఆయన తీర్పులో నిలబడితే నువ్వు ఏ గుంపులో ఉంటావు? బైబిల్‌లో వ్రాసిన ఏ విషయం కూడా ఎవరో కల్పించినవి కావు, జరిగిన చరిత్ర, జరుగుతున్న, జరగబోయే సంగతులు ఉన్నాయి. 2000సం॥ల క్రితం సమస్త మానవాళిని మోసుకొనిపోయే దేవుని గొర్రెపిల్ల, మెస్సియా పుడతాడు అని చెప్పబడింది. వారు చెప్పిన కొన్ని వందల సం॥ల తరువాత ఆయన పుట్టాడు,

లోకపాపములను ఆయన మీద వేసుకొని సిలువలో బలియైన గొర్రెపిల్లగా మరణించాడు, తిరిగి లేచి తండ్రి యొద్దకు వెళ్ళాడు. నేను వెళ్ళి మరలా వస్తాను, నేను వచ్చే సమయ మునకు సిద్ధపడి ఉండమని ఆయన చెప్పి వెళ్ళిన తరువాత ఆయన చెప్పిన విషయాలన్నీ జరుగుతూ ఉన్నాయి. ఇంక మనం చివరి గడియలలో ఉన్నాము, ఆయన త్వరగా రాబోతు న్నాడు. అక్రమం విస్తరించి అనేకులలో ప్రేమ చల్లారిపోయి మోసాలు, నయవంచన చేసు కుంటూ అసలు లోకములో, క్రైస్తవ సంఘాలలో కూడా అబద్ధమే రాజ్యం ఏలుతుందా అని అనిపిస్తుంది. అందుకే ఇది చివరి గడియ అని ఖచ్చితంగా చెప్పవచ్చును.

**"ఆయన చేట ఆయన చేతిలో ఉన్నది; ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రము చేసి గోధుమలను కొట్టులోపోసి, ఆరని అగ్నితో పొట్టును కాల్చివేయునని వారితో చెప్పెను." మత్తయి 3: 12**

నువ్వు నిజమైన గోధుమవైతే దేవుని రాజ్యములో ఉంటావు, పొట్టువైతే నరకములోనికి త్రోసివేయబడతావు. నోవహు కాలములో జరిగినట్లుగా ఇప్పుడు కూడా జరుగుతుంది. జల ప్రళయం వస్తుంది, మనుష్యులు కొట్టుకుపోతారు, ఓడను కట్టమని దేవుడు నోవహుతో చెప్పాడు. ఈ ఓడలో ప్రవేశించిన వారు మాత్రమే బ్రతుకుతారు అని చెప్తుంటే అందరూ నవ్వుకుంటూ ఏంటి జలప్రళయమా? అలాంటివి ఏమీ రావు అని మనుష్యులు నారు నాటు కుంటూ, ఇండ్లు కట్టుకుంటూ ఉన్నారు. అలాగే ఇప్పుడు కూడా ఈ రోజులలో టెక్నాలజీ ఇంత పెరిగిపోతే దేవుడు రావడం ఏంటి? అని అబ్బా! ఎంత హాయిగా సాగిపోతుంది జీవితం, అంతా నెమ్మదిగా ఉంది, ఇక ప్రాబ్లెం లేదు అని అనుకుంటూ ఉన్న సమయము లలో, నోవహు దినాలలో జలప్రళయం వచ్చి, ఎలాగు అందరూ కొట్టుకొనిపోయారో, యేసయ్య రాకడ కూడా ఆలాగు ఉండును. అలాగే ఎవరు నమ్మినా, నమ్మకపోయినా, దాని కోసం ఎదురు చూసినా, చూడకపోయినా తెలియకుండా వస్తుంది ఆయన రాకడ దినం.

**"అలాగే యుగసమాప్తియందు జరుగును. దేవ దూతలు వచ్చి నీతిమంతులలోనుండి దుష్టులను వేరుపరచి వీరిని అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయును ఉండును". మత్తయి 13:49,50**

యుగ సమాప్తిలో ఏమి జరుగుతుందంటే నీతిమంతుల నుండి దుష్టులను వేరుచేసి, వీరిని అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును, పండ్లు కొరుకుటయును ఉండును, దుష్టులు కూడా నీతిమంతులతో కలిసిపోయి ఉంటారు. ఒకరోజు ఆయన వేరు చేసే సమయం వస్తుంది, అది రాకముందే మన ప్రవర్తనను మార్చుకొని, దుష్టత్వమును విడిచి పెట్టాలి.

**"అప్పుడు నీతిగలవారెవరో దుర్మార్గులెవరో దేవుని సేవించువారెవరో ఆయనను సేవించనివారెవరో మీరు తిరిగి కనుగొందురు". మలాకీ 3:18**

నీతిమంతులు ఎవరో దుర్మార్గులు ఎవరో, సేవించువారెవరో, సేవించనివారెవరో తెలిసే రోజు ఒకటి వస్తుంది. ఆ రోజు నువ్వు ఎటువైపు ఉండబోతున్నావు? ఎంతకాలం మార్పును వాయిదా వేసుకుంటూ, అతిక్రమాలను వదిలిపెట్టకుండా సాగిపోతూ ఉంటావు? అతిక్రమములు దాచి పెట్టకుండా ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందుతాడు. ఆయన తీర్పు దినాన ఆయన యెదుట నిలువలేని పరిస్థితి మనకి వద్దు. ఇప్పుడు వాక్యం ద్వారా సూటిగా స్పష్టంగా దేవుడు మాట్లాడుతున్నప్పుడు మనం సత్యంవైపు, నీతివైపు, యథార్థత వైపు, దేవునిరాకడ కొరకు ఎదురు చూస్తున్న వారిగా ఉంటే తలెత్తుకుని ధైర్యంగా ఉంటాము.

**"అప్పుడు సమస్త జనములు ఆయనయెదుట పోగుచేయబడుదురు; గొల్లవాడు మేకలలో నుండి గొఱ్ఱెలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరుపరచి" మత్తయి 25:32**

మేకలను గొర్రెలను కాసేవారు మేకలను, గొర్రెలను వేరుపరచినట్లుగా ఆయన వేరుపరచి, కుడివైపున ఎడమవైపున రెండువైపులను నిలువబెట్టి, మరలా అక్కడ నీతిమంతులను దుష్టులను వేరుచేసినట్లు చేసి

**"అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి -నా తండ్రిచేత ఆశీర్వదింపబడినవారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి; దప్పిగొంటిని, నాకు దాహమిచ్చితిరి; పరదేశినై యుంటిని నన్ను చేర్చుకొంటిరి; దిగంబరినై యుంటిని, నాకు బట్టలిచ్చితిరి; రోగినైయుంటిని, నన్ను చూడవచ్చితిరి; చెరసాలలో ఉంటిని నా యొద్దకు వచ్చితిరని చెప్పును। అందుకు నీతిమంతులు -ప్రభువా, యెప్పుడు నీవు ఆకలిగొనియుండుట చూచి నీకాహారమిచ్చితిమి? నీవు దప్పిగొనియుండుట చూచి యెప్పుడు దాహమిచ్చితిమి? ఎప్పుడు పరదేశివై యుండుట చూచి నిన్ను చేర్చుకొంటిమి? దిగంబరివై యుండుట చూచి బట్టలిచ్చితిమి?। ఎప్పుడు రోగివై యుండుటయైనను, చెరసాలలో ఉండుటయైనను, చూచి, నీ యొద్దకు వచ్చితిమని ఆయనను అడిగెదరు. అందుకు రాజు -మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును.। అప్పుడాయన యెడమవైపున ఉండువారిని చూచి- శపింపబడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి". మత్తయి 25:34-41**

దేవుడు మనకు సమయం ఇచ్చిన సందర్భంలోనే మనం వెళ్ళవలసిన మార్గంలో వెళ్ళి, జీవితంలో చేయవలసినవి చేస్తూ, ఏది గమ్యమో ఆ గమ్యంవైపు ప్రయాణంచేస్తూ దేవునిచేత

ఆశీర్వదింపబడినవారలారా! అని పిలిపించుకొని నిత్యజీవములోకి వెళ్ళాము. దేవుడు కుడి వైపున నీతిమంతులను ఎడమవైపున అనీతిమంతులను ఉంచాడు. గొర్రెలు, మేకలు. దేవుని మాటలు వినిన వారిని గొర్రెలతోను, దేవుని మాట విననివారిని మేకలతోనూ పోల్చాడు దేవుడు.

**"ఒక గంపలో ముందుగా పక్వమైన అంజూరపు పండ్లవంటి మిక్కిలి మంచి అంజూరపు పండ్లుండెను. రెండవ గంపలో మిక్కిలి జబ్బైన అంజూరపు పండ్లుండెను; అవి తిన శక్యము కానంతగా జబ్బువి. యెహోవా -యిర్మీయా, నీకేమి కనబడుచున్నదని నన్నడుగగా నేను- అంజూరపుపండ్లు కనబడుచున్నవి, మంచివి మిక్కిలి మంచివిగాను జబ్బువి మిక్కిలి జబ్బువి గాను, తిన శక్యముకానంత జబ్బువిగాను కనబడుచున్నవంటిని. అప్పుడు యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను -ఇశ్రాయేలు దేవుడైన యెహోవా ఆజ్ఞ ఇచ్చునదే మనగా -వారికి మేలుకలుగవలెనని ఈ స్థలము నుండి నేను కల్దీయుల దేశమునకు చెరగా పంపు యూదులను, ఒకడు ఈ మంచి అంజూరపు పండ్లను లక్ష్యపెట్టునట్లు లక్ష్యపెట్టు చున్నాను. వారికి మేలు కలుగునట్లు నేను వారిమీద దృష్టియుంచుచు, ఈ దేశమునకు వారిని మరల తీసికొనివచ్చి, పడగొట్టక వారిని కట్టెదను, పెల్లగింపక వారిని నాటెదను. వారు పూర్ణహృదయముతో నా యొద్దకు తిరిగి రాగా వారు నా జనులగునట్లును నేను వారి దేవుడనగునట్లును నేను యెహోవానని నన్నెరుగు హృదయమును వారికిచ్చెదను." యిర్మీయా 24:2-7"**

దేవుడు యిర్మీయా ప్రవక్తకి రెండు గంపలలో ఉన్న అంజూర పండ్లును చూపించి, నీకు ఏమి కనబడుతున్నది అని అడిగాడు ఒక గంపలోనేమో పక్వానికి వచ్చి తినడానికి సిద్ధంగా ఉన్న పండ్లు. మరొక గంపలోనేమో పూర్తిగా పాడైపోయిన ఎందుకు పనికిరాని పండ్లు కనబ డుతున్నాయి అని చెప్పాడు. అప్పుడు దేవుడు చెప్పాడు... ఏవైతే పక్వానికి వచ్చి, తినడానికి రెడీగా ఉన్నాయో వాటిని నేను దేనికి చెప్తున్నానంటే ఎవరయితే నా మాట విని నా మార్గంలో నడవడానికి ఇష్టపడతారో వారిని నశింపజేయక వారిని నష్టపరచకుండా నిలబెట్టి, కాపాడి, రక్షించి, ఆశీర్వాదకరంగా ఉంచుతాను. ఎవరైతే నా మాట వినకుండా ఇష్టానుసారంగా ప్రవ ర్తిస్తారో వారు ఆ జబ్బు అంజూరపు పండ్లవలె నశించిపోయి, మరల ఎన్నడూ తిరిగి కోలు కోలేని పరిస్థితిలో ఉంటారు. దానికి గుర్తుగా నేను ఈ రెండింటినీ మీకు చూపిస్తున్నాను అని చెప్పాడు. అక్కడేమో గొర్రెలుగా, మేకలుగా, ఇక్కడేమో మనోహరమైనవిగానూ ప్రయోజన కరమైనవిగానూ, తినడానికి సిద్ధముగా ఉన్నవిగానూ ఉన్న గంప ఒకటి, పనికిరాని కుళ్ళి పోయిన జబ్బు వంటివి లేక అవి తింటే అనారోగ్యం వచ్చే గంప. నువ్వు పక్వానికి వచ్చిన అంజూరపు పండ్ల గంపవలె ఉన్నావా లేక తినడానికి పనికిరాని అంజూరపు పండ్ల గంపవలె

ఉన్నావా? గొర్రెవలె ఉన్నావా లేక మేకవలె ఉన్నావా? నీతిమంతుల యొక్క గుంపులో చేర్చ బడేదానిగా ఉన్నావా లేక దానిలో నుంచి వేరు చేసే దుష్టుడి గుంపులో ఉన్నావా? ఎక్కడ ఉన్నావు నువ్వు? దేవుడు నిన్ను ప్రశ్నిస్తున్న ఈ ప్రశ్నకు సమాధానం చెప్పి, నీ బలహీనతని, లోపాలను దేవుని ఎదుట ఒప్పుకుంటే, దేవుడు ఈ దినమందు ఆయన కనికరము చూపించ డానికి సిద్ధంగా ఉన్నాడు. ఆయన కరుణా సంపన్నుడు, ఆయన కనికరము తరతరముల మీద ఉంది.

ప్రభువా ఏవి చేయాలో, ఏవి చేయకూడదో అవన్నీ చేసేశాను. ఈ ఒక్కసారి నన్ను కనికరించు, నా పట్ల దయ చూపించు, నన్ను క్షమించు. నాకు ఒక దారి చూపించు అని అడిగితే నిజంగా నువ్వు మారాలనే గట్టి తీర్మానం నీలో ఉంటే తప్పకుండా దేవుడు కనికరాన్ని చూపించి నీకొరకు ఆయన ఒక దారిని సిద్ధపరుస్తాడు. నిన్ను తప్పకుండా ఆ పరిస్థితులలో నుండి బయటకు తీసుకునివస్తాడు. నిన్ను క్షమించి, నువ్వు నశించిపోకుండానూ, ఆ మేకల మందలోనికి, ఆ అగ్నిగుండములోనికి త్రోసివేయబడకుండానూ, దేవునిచేత ఉమ్మివేయబడ కుండానూ, అసహ్యంపబడకుండాను దేవుడు కాపాడుతాడు.

మనస్ఫూర్తిగా దేవుని పాదాలు పట్టుకొని, దేవుని ఎదుట కన్నీరు విడిచిన యెడల ఆయన క్షమించి, దేవుని యొక్క రాజ్యానికి వారసుడిగా/వారసురాలిగా చేస్తాడు. ఆశీర్వదించబడిన గుంపులోనికి ఆయన తీసుకుంటాడు.

**అట్టి భాగ్యమును దేవుడు మనకు దయ చేయును గాక!**



# ఆరోగ్య విభాగము

**అంశం: నోరూరించే బయట ఆహారం వలన కలిగే అనర్థాలు**

- ✎ వర్షాకాలంలో నోటికి రుచించే బజ్జీలు, పానీపూరీలు వంటి బయట ఆహారం తీసుకోరాదు.
- ✎ తద్వారా వైరస్ త్వరగా నీ శరీరములో చేరుతుంది.
- ✎ వైరస్ శరీరములో ప్రవేశించకుండా రక్షణ వ్యవస్థ పటిష్టంగా ఉండాలి.
- ✎ బయట ఫుడ్స్ తీసుకోవడం ద్వారా రక్షణ వ్యవస్థ డామేజ్ అవుతుంది.
- ✎ వర్షాకాలంలో కనీసం 3లీటర్లు నీరు త్రాగాలి.
- ✎ ఉదయకాలంలో ఫ్రూట్ జ్యూస్, వెజిటెబుల్ జ్యూస్, బొప్పాయి తీసుకోవాలి.
- ✎ విటమిన్ సి అధికముగా లభించే నిమ్మ, ఉసిరి, జామ పళ్ళు తీసుకోవాలి.
- ✎ రాత్రి భోజనం ముందుగా ముగించాలి. వేళకు నిద్రపోవాలి.
- ✎ 12గంటల fasting ప్రతిరోజూ మెయింటైన్ చేయాలి.
- ✎ రాత్రి 7కి ఆహారం తీసుకుంటే మరలా మరుసటి రోజు ఉదయం 7 తరువాతే ఆహారం తీసుకోవాలి.

**దేవుడు మీకు మంచి ఆరోగ్యం దయచేయును గాక! ఆమేన్**



# అమ్మ

సిస్టర్. విజయ

ఈ లోకంలో నువ్వు ద్వేషించినా కూడా నిన్ను ప్రేమించే వాళ్ళు ఉన్నారంటే అది కేవలం అమ్మ మాత్రమే. ఒక బిడ్డ పుట్టినప్పుడు అమ్మ తన ముక్కు, చెవులు బాగున్నాయా? ఏ కలర్ అని చూడదుగానీ ఆనందంతో ఒకసారి గుండెకు హత్తుకొంటుంది. ప్రసవ వేదన స్త్రీకి పునర్జన్మ అంటారు. ఆమె పడిన ప్రసవ వేదనని, నొప్పులన్నీ కూడా మరచిపోతుంది తల్లి ప్రేమ. మనం ఎంత కోపగించుకున్న, నవ్వుతూ అడుగుతుంది తిన్నావా, తినలేదా అని చూస్తుంది అది అమ్మ ప్రేమ. అలసిపోయినా, ఆరోగ్యం బాగోకపోయినా కుటుంబం కోసం కష్టపడుతూ ఉంటుంది, అది అమ్మప్రేమ.

సహనము, ఓర్పు స్త్రీలకు చాలా ఎక్కువ. మరి ముఖ్యంగా తల్లులైన వారిని పిల్లలు ఎంత విసిగిస్తున్ననూ ఓర్చుకొని భరిస్తారు దానికి కారణం అమ్మప్రేమ. ఏదో ఒకరోజుని తల్లుల దినోత్సవం అని నిర్ణయించి ఆ రోజున మాత్రం ఆమెను ప్రేమించి, చక్కగా చూసుకోవడం కాదు, ఆ తల్లి మనసులో ఏమి కోరుకుంటుంది, తన పిల్లలు ఏ విధంగా ఉండాలని ఆశపడు తున్నదో గ్రహించి, ఆ విధంగా ప్రవర్తించే పిల్లలు ఇప్పటి తరము వారిలో ఎంతమంది ఉన్నారు అని చూస్తే చాలా చాలా తక్కువమంది.

నీకేమి రాదు మమ్మీ, ఏమీ తెలీదు అని చిరాకుపడేవారు కొందరు. ఆ వంటగదిలో వంట చేయడం తప్ప ఏమీ తెలియదు అని నోరు కూడా ఎత్తనివ్వకుండా వాళ్ళకే అన్నీ తెలిసినట్లు గా మాట్లాడే పిల్లలు ఎంతమంది? కానీ ఆ తల్లి ఎప్పుడూ నీ మేలు, క్షేమం కోరుకునేది అని, నిన్ను గద్దించి, సరిచేసి చక్కగా నిన్ను పెంచాలని, నడిపించాలని కోరుకొనేది అని గ్రహించే ది ఎప్పుడు? నేను నా పిల్లలను నీకులా పెంచను, చాలా modernగా పెంచుతాను అని మాట్లాడుతున్న పిల్లలు తల్లి ప్రేమను, ఆందోళనను అర్థం చేసుకోవట్లేదు అనేది వాస్తవమైన విషయం.

**"కాకి పిల్ల కాకికి ముద్దు"** అనే సామెత మనం లోకంలో వింటాము. దానిలో ఎంతో అర్థం ఉంది. ఎందుకంటే పిల్లలు రూపంలోగానీ, గుణంలోగానీ ఎలాంటివారైనా తల్లి తన ప్రేమ ను, మమకారమును వాటికి అనుగుణంగా మార్చుకోదు. తల్లిప్రేమను పేగుబంధం అంటా రు అంటే రక్తమును పంచి కని, పాలిచ్చి పెంచుతూ పెరిగి పెద్దవాళ్ళవుతూ ఉండగా అన్ని విధములుగా వారికి సహాయపడి, ప్రయోజకులుగా చేయాలనే తపన తల్లిలో ఎంతో కనబ డుతుంది. కొంతమంది తండ్రులు బాధ్యత లేనివారైనా తల్లి ఏదో విధంగా కష్టపడి తన పిల్లల అభివృద్ధి చూడాలని కోరుకుంటుంది. అమ్మ తన ప్రాణం ఉన్నంత వరకు బిడ్డలపైన


నీ బాధకు కారణం ఏదైనా కావచ్చు. కానీ ఆ కారణంతో ఇతరులకు మాత్రం హాని చేయకు.

మమకారం, ప్రేమ కనపరుస్తూనే ఉంటుంది. అందుకే అమ్మను పోగొట్టుకుంటే మనుష్యులు చలించిపోతారు.

బైబిల్ గ్రంథంలో రాజాజ్ఞకు భయపడక తల్లిప్రేమ గొప్పది అని చాటి చెప్పిన స్త్రీ యోకెబెదు.

**"ఆ స్త్రీ గర్భవతియై కుమారుని కని, వాడు సుందరుడై యుండుట చూచి మూడునెలలు వానిని దాచెను." నిర్గమ 2:2**

ఆ సమయములో ఐగుప్తు రాజైన ఫరో ఇశ్రాయేలు జాతి ప్రజలను బానిసలనుగా చూస్తూ, వారి సంతానములో మగపిల్లవాడు పుడితే చంపివేయమని ఆజ్ఞాపించగా, ఆ ఆజ్ఞకి భయ పడక, 3నెలలు వానిని దాచి, తరువాత దాయలేక అపాయంలో ఉపాయంగా ఆ తల్లి ఇలా ఆలోచించింది. ఒక జమ్ముపెట్టె తీసుకొని దానికి జిగటమన్నును, కీలును పూసి, పిల్లవానిని అందులో ఉంచి, ఏటి ఒడ్డున జమ్ములో సురక్షితమైన స్థలములో దానిని ఉంచిరి. వానికేమి సంభవించునో తెలుసుకొనుటకు వాని అక్క దూరముగా నిలిచి ఉండెను. యోకెబెదు గట్టిగా నమ్మినవిషయం ఫరో కుమార్తె స్నానము చేయటానికి ఆ నది దగ్గరకు వస్తుంది అని, ఆ విధంగానే ఆమె వచ్చింది. ఆమె పనికత్తెలు నాచులోని పెట్టెను చూసారు, ఫరో కుమార్తె దానిని తెప్పించి

**"తెరచి ఆ పిల్లవాని చూచినప్పుడు ఆ పిల్లవాడు ఏడ్చుచుండగా చూచి వానియందు-కనికరించి వీడు హెబ్రీయుల పిల్లలలో నొకడనెను" నిర్గమ 2:6**

అప్పుడు అక్కడే ఉన్న అతని అక్క నీ కొరకు ఈ పిల్ల వానిని పెంచుటకు నేను హెబ్రీ స్త్రీలలో ఒక దాదీని పిలుచుకొని వత్తునా అనెను. అందుకు ఫరో కుమార్తె వెళ్ళమనగా, ఆ చిన్నది వెళ్లి బిడ్డ తల్లిని పిలుచుకొని వచ్చెను. అప్పుడు ఆ తల్లి పెంచి, పెద్ద చేసి ఫరో కుమార్తె యొద్దకు తీసుకొని వచ్చెను.

**<u>యోకెబెదు యొక్క సుగుణములను మనం ధ్యానిస్తే:</u>**

ఆమె దేవుని మహాత్యమును, గొప్పతనమును తన జీవితములో తన బిడ్డల విషయంలో చూపించింది.

విశ్వాసము కలిగిన స్త్రీ – మోషే పుట్టినప్పుడు రాజు యొక్క ఆజ్ఞకి భయపడలేదు. **"మోషే పుట్టినప్పుడు అతని తలిదండ్రులు ఆ శిశువు సుందరుడై యుండుట చూచి, విశ్వాసమును బట్టి రాజాజ్ఞకు భయపడక, మూడు మాసములు అతనిని దాచిపెట్టిరి." హెబ్రీ 11:23**

ఆ తల్లి యొక్క విశ్వాస ప్రభావం మోషే మీద చాలా ఉంది.

**"మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమునుబట్టి ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము పాపభోగం అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి, ఫరో కుమార్తెయొక్క కుమారుడని అనిపించు కొనుటకు ఒప్పుకొనలేదు;" హెబ్రీ 11:24**

**జ్ఞానం కలిగినది:** అపాయకరమైన పరిస్థితులలో ఎంతో ఉపాయంగా ఆలోచించింది. మనం కూడా కుటుంబములో ఎలాంటి పరిస్థితులలోనైననూ నిరాశపడక అట్టి జ్ఞానం కలిగి జీవించాలి.

ఆ పెట్టెను ఏటి ఒడ్డున జమ్ములో ఉంచి, తాను చేయగలిగినది చేసి దేవుని సహాయం కొరకు సహనముతో, ఓపికతో ఎదురు చూసింది. నిరీక్షణను కలిగి ఉంది. ఆ నిరీక్షణని దేవుడు సిగ్గుపరచలేదు. ఫరో కుమార్తె రావటం, చూడటం, బిడ్డని పెంచడానికి ఆ తల్లికి ఇవ్వటం అన్నీ జరిగిపోయాయి. ఆ తల్లి ఇశ్రాయేలు ప్రజలు మీద ప్రేమతో దేవునికి ప్రయో జనకరమైన సాధనంగా ఆ బిడ్డని మలిచింది.


మోషే చరిత్రలో గొప్ప వ్యక్తిగా నిలిచిపోయాడు, నా ఇల్లంతటిలో నమ్మకస్తుడు, భూమిమీద ఉన్న వారిలో మిక్కిలి సాత్వికుడు అని దేవుని చేత సాక్ష్యము పొందినవాడు. ఇంకా మిగిలిన పిల్లలైన అహరోను, మిర్యాములను కూడా దేవుని సేవలో నిలిపి ఉంచిన తల్లి యోకెబెదు. ఆ తల్లి యొక్క ప్రభావం ఫరో యొక్క ఐగుప్తు ధన ప్రభావంకంటే ఎక్కువగా మోషే మీద ఉంది అనేది వాస్తవమైన విషయం. కనుక మనం కూడా అట్టి స్త్రీ వలె జీవిద్దామా?

**అట్టి కృప దేవుడు మనకు దయచేయును గాక!**

**ముఖ్య గమనిక:**

మీ ప్రార్థనావసరతలకై ఎపఫ్రా మినిస్ట్రీస్ ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.00 గం॥ల నుండి సాయంత్రం 6.00 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com



# జాన్ వెస్లీ

**– సీరియల్ 32 వ భాగము**

నిజమైన సేవ ఎవరు చేసినను తన రాజ్యము పాడగుచున్నదని సైతాను తప్పక ఎదురు లేచును అని వెస్లీ గ్రహించెను. గనుక ఎవరినైన సేవకు పంపినచో ఆయన "ఎవరైనా మార్పు చెందినారా? ఎవరైనా అభ్యంతరపడినారా?" అని ప్రశ్నించెడివాడు. రౌడీలకై ప్రఖ్యాతిగాంచిన వెడ్‌నెస్‌బరీ, వాల్‌సాల్, డార్లస్టన్ అను మూడు స్థలములలో భయంకరమైన వ్యతిరేకత, ఎదిరింపు లేచెను. న్యాయ విచారణకర్తల యొద్ద ఎట్టి ఆశ్రయము దొరికెడిది కాదు. ఎందుకనిన, ఈ దౌర్జన్యకారులను పురిగొల్పినవారు వీరే. స్టాఫర్డ్ షాయర్‌లోని న్యాయాధిపతి ఈ మెథడిస్టు బోధకుల వలననే అల్లరులు లేచుచున్నవి గనుక వారిని అరెస్టు చేసి తన ఎదుటకు తీసికొనిరమ్మని ఆజ్ఞాపించెను.

1743వ సంవత్సము అక్టోబర్ 20వ తేదీ వెడ్‌నెస్‌బరీలో జరిగిన ఒక సంఘటన:-

సాయంకాలము 5గంటల సమయమున అల్లరిమూకలు వెస్లీ బస చేయుచున్న ఇంటిని ముట్టడివేసిరి. బయట జనసంఖ్య అమాంతముగా పెరిగెను. వారందరు కలసి "బోధకుని బయటకు తెచ్చి మాకు అప్పగించండి" అని కేకలు వేసిరి.


బయట సింహమువలె గర్జించుచున్న నాయకుని తన యొద్దకు తీసికొని రమ్మని వెస్లీగారు ఒకరిని పంపిరి. కోపోద్రేకముతోనున్న ఇతనిని వెస్లీగారి యొద్దకు తీసికొనిరాగా ఆ సింహము గొఱ్ఱెవలె సాధువాయెను. వెస్లీ నోటనుండి వచ్చిన కొద్దిమాటలు ఈ మార్పును తెచ్చెను. "నీవు వెళ్లి నీతోటి నాయకులను మరిద్దరిని తీసికొనిరమ్ము" అని వెస్లీ అతనిని పంపెను. అప్పుడతడు మరిద్దరిని తీసికొనిరాగా వారు మిగుల రౌద్రులై వెస్లీని మ్రింగుటకు సిద్ధముగా ఉన్నట్లుండిరి కాని 2నిమిషములలో వారి కోపముగూడ పూర్తిగా చల్లారెను.

దేవుని సన్నిధి తనతో ఇంత సమీపముగా ఉండుట చూచి వెస్లీ ఇకతానే ఆ శత్రు సమూహములలోనికి వెళ్ళెదనని బయటకు వచ్చెను. వారి మధ్యకు చేరి ఒక కుర్చీ తెప్పించుకొని దానిపై నిలుచుండి "మీకేమి కావలెను?" అని అడిగెను. "న్యాయాధిపతి లేన్‌గారు మిమ్ములను ఆయన యొద్దకు తీసికొని రమ్మనిరి" అనిరి. తప్పకుండా వచ్చెదనని బదులు పలికి వెస్లీ బయలుదేరెను. ఈ మాటలు విని అనేకులు తమ తమ ఇండ్లకు వెళ్లిపోయిరి. ఇక 300 మంది మాత్రమే మిగిలిరి. వెస్లీ లేన్‌గారి ఇంటికి వారితో ఒక మైలుదూరము నడిచి వెళ్ళెను. చీకటిపడెను, వర్షము కురియుచుండెను. వీరు లేన్‌గారి ఇల్లు చేరి "అయ్యా! పాదిరిగారిని

తెచ్చితిమండి!" అని కేకలువేసిరి. "మిమ్మును ఎవరు తీసికొని రమ్మనిరి? ఆయనను వెనుకకు తీసికొని వెళ్ళండి" అని లోపలినుండి జవాబు ఇచ్చెను. వారిలోని ముఖ్యులు తలుపు గట్టిగా తట్టి "అయ్యా! ఈయన వలన ప్రజలు దినమంతా కీర్తనలు పాడు చున్నారు. ఈయన కూటములకై నిద్రనుండి తెల్లవారి 5గంటలకే లేచి పోతున్నారండీ" అని బిగ్గరగా అరిచిరి. లేన్‌గారు "మీరు మీ గోల మాని ఇంటికి వెళ్ళుడి" అని ఆజ్ఞాపించిరి.

కోపోద్రేకముతో మండుచున్న ఈ జనసమూహమునకు వెస్లీకి ఏ శిక్ష విధింపబడకుం డుటకు ఇష్టం లేదు గనుక ప్రక్క గ్రామమైన వాల్‌సాల్‌కు నడిపించుకొని వెళ్లిరి. ఆ వూరి మెజిస్ట్రేట్ వారు వచ్చుచున్నది తెలిసికొని తన పడకగదికి వెళ్లి తలుపు మూసుకొనెను. అప్పుడు సమయము రాత్రి 7గంటలే. అయినను ఆయన పడకకు వెళ్లినందున బయటకు రాలేదు. ఇక ఇంటికి వెళ్లుట తప్ప వేరే దారి తోచక కొంతదూరము నడుచుచుండగా వాల్‌సాల్ నుండి అల్లరిమూక వారిపై దొమ్మిగా పడెను. మునుపు ఉన్న వారికంటే అధిక సంఖ్యలో ఉన్న ఈ క్రొత్త గుంపు వెస్లీ చుట్టు కాపుదలగా ఉన్నవారిని కింద పడద్రోసిరి. పెద్ద అరపులతో వెస్లీని చుట్టుముట్టిరి. చుట్టూ నలుదిక్కుల నుండి సముద్రపు హోరువంటి శబ్దము లేచెను. వారు వెస్లీని పట్టణము యొక్క ఒక చివరి నుండి మరియొక చివరికి ఈడ్చు కొని పోయిరి. అచ్చట ఒక ఇంటి తలుపు తెరచి ఉండుట జూచి వెస్లీ లోపలకు ప్రవేశించ బోయెను గాని ఆ యింటి యజమానుడు అల్లరిగుంపు తన ఇంటిని ధ్వంసము చేయునను భయముతో వెస్లీని తన ఇంట ప్రవేశించుటకు అనుమతించలేదు. అయినను వెస్లీ తలుపు యొద్ద నిలువబడి వారితో "నేను చెప్పునది దయచేసి ఆలకించుడి" అని అర్థించెను. "వద్దు! వద్దు! ఆయన తల బ్రద్దలుచేయండి. అతనిని వెంటనే చంపివేయండి"అని రంకెలు వేసిరి. కాని కొందరు "ఆయనేమి చెప్పునో వినెదమనిరి". అంతట వెస్లీ "నేను మీకేమైనా కీడు చేసితినా! మాటలోగాని, క్రియలోగాని మీలో ఎవరికైనా హాని చేసితినా! అనుచు పావుగంట సేపు వారితో మాట్లాడెను. వారి అల్లరికంటే పైగా తన స్వరమెత్తుట వలన ఆయన స్వరము జీరబోయెను. అంతట వారు బిగ్గరగా "ఆయనను చెరపట్టుడి,తీసుకొని పోయెదము" అని ఏకుమ్మడిగా అరిచిరి.

**సేకరించబడింది**
**(ఇంకా ఉంది)**



# ఆశయం

హాయ్ పిల్లలు ఎలా ఉన్నారు? Exams అయిపోయాయి ఇక ఆటలతో bus నా? ఎండలు బాగా ఉన్నాయి, జాగ్రత్తగా ఉండండి. ఎండలో తిరగవద్దు. Indoor games ఆడుకోండి. కొందరైతే అమ్మమ్మ, నాయనమ్మ ఇంటికి చెక్కేసి ఉంటారు కదా! కొందరేమో చర్చిలో fullattendance prize కోసం ఎక్కడికీ వెళ్ళకుండా ఇక్కడే ఉండి ఉంటారు. సరే ఒక మంచి story చూద్దామా!

ఒక ఉదయకాలమున ఒక చిన్న పాప సండేస్కూల్‌కి వెళ్ళి, ఆ గది అంతా పిల్లలతో నిండి పోయి, ఖాళీ లేకపోవడం వలన బయటే నిలబడి భోరున ఏడవ సాగింది. అప్పుడే లోపలికి వచ్చుచున్న పాస్టర్‌గారు ఆ చిన్న పాపను చూచి, “పాపా ఎందు కు ఏడుస్తున్నావు? అని జాలిగా ప్రశ్నించారు. అందుకు ఆ అమ్మాయి వెక్కి వెక్కి ఏడుస్తూ “అంకుల్, నాకు లోపల స్థలం లేదు” అని జవాబిచ్చింది.

“పాపా! నువ్వు దిగులుపడవద్దు. నేను నిన్ను లోపలకి తీసుకెళ్తాను. అతి త్వరలోనే పిల్లలందరికీ సరిపోయేటంత పెద్ద హాలును కడతాము!” అని పాస్టర్‌గారు ఆప్యాయంగా ఆ అమ్మాయిని ఎత్తుకొని లోపలికి తీసుకొని వెళ్ళి మిగిలిన సండే స్కూల్ పిల్లలతోపాటు కూర్చో బెట్టారు. సండేస్కూల్ అయిపోయిన తర్వాత ఆ అమ్మాయి సంతోషంతో గంతులు వేసు కుంటూ ఇంటికి వెళ్ళి, జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకి చెప్పి, పెద్ద సండే స్కూలు బిల్డింగ్ కట్టడం కోసము నేను డబ్బును పొదుపు చేస్తానని చెప్పింది. ఆమె తల్లిదండ్రులు ఎంతో పేద వారైనప్పటికీ ఆ అమ్మాయికున్న ఉన్నతమైన ఆశయాన్ని బట్టి సంతోషిస్తూ అప్పుడప్పుడూ కొన్ని డబ్బులను ఇస్తూ ప్రోత్సాహపరిచేవారు. ఆమె వాటనన్నింటినీ ఒక చిన్న కిడ్డీ బ్యాంకులో దాచుకునేది.

కానీ కొన్ని వారాలలోనే ఆ అమ్మాయి అనారోగ్యమునకు గురై ఈ లోకాన్ని విడిచి తాను ప్రేమించిన ప్రభు సన్నిధికి వెళ్ళిపోయింది. ఆమెపై కరుణ చూపిన పాస్టర్ గారిని పిలువ నంపగా ఆయన కన్నీటితో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రులు ఆయన దగ్గరికి వచ్చి వారి కుమార్తె ఏవిధంగా విశాలమైన సండే స్కూల్ బిల్డింగ్ కొరకు డబ్బును పొదుపు చేసిందో చెప్పి, వెంటనే ఆ మొత్తాన్ని ఆయన చేతిలో పెట్టారు. చిల్లర (క్వాయిన్) రూపంలో ఉన్న ఆ డబ్బులు లెక్కచూడగా పదివేల డాలర్లుగా తేలింది. ఆ చిన్న డబ్బు యొక్క త్యాగానికి ఆ పాస్టర్ గారి హృదయం చలించిపోయింది. ఆ తరువాత తన సంఘ పెద్దల

సమావేశంలో 10వేల డాలర్ల గురించి ప్రస్తావించారు. "కొత్త భవనం కొరకు ఇవ్వబడిన మొట్టమొదటి విరాళం ఇదే" అని చెప్పిన పాస్టర్‌గారి మాటలు ఆ సంఘ పెద్దలకు సవాలుగా మారాయి. వారు విరాళాలను సేకరించడం మొదలుపెట్టారు. ఆ పెద్దలలో ఒకరు ఒక దినమున పాస్టరుగారి దగ్గరికి వచ్చి "ఆ పట్టణములోని ముఖ్య వీధిలోనున్న పెద్ద స్థలమైతే మనకు సరిపోతుంది అని సలహా ఇచ్చాడు. ఆ సలహాను స్వీకరించిన పాస్టర్‌గారు ఆ స్థలము యొక్క యజమాని దగ్గరికి వెళ్ళాడు. ఆ చిన్నపిల్ల యొక్క వాంఛను గురించి, ఆమె ప్రయాస పడి పొదుపు చేసిన 10వేల డాలర్ల గురించి ఆయనకు వివరించాడు. ఆయన సంఘసభ్యుడు కాకపోయినప్పటికీ ఆ విశాలమైన స్థలము ఎంతో ఖరీదైనప్పటికీ దానిని 20 వేల డాలర్లకే ఇవ్వడానికి సంసిద్ధుడయ్యాడు. వారి దగ్గర అంత డబ్బు కూడా లేదని తెలుసుకుని ఆ 10వేల డాలర్లు అడ్వాన్సుగా తీసుకుని "మిగిలినది తరువాత ఇవ్వవచ్చును" అని చెప్పాడు. వేరొక దూత 10వేల డాలర్లు విరాళముగా ఇవ్వగా దాని వెలను చెల్లించి ఆ స్థలాన్ని వారు స్వాధీనము చేసుకున్నారు. ఆ చిన్నపిల్ల యొక్క త్యాగము, ఆ సంఘసభ్యుల ఆసక్తి ఆ నోటా ఈ నోటా ప్రాకి ఆ ప్రాంతమంతా తెలిసి అనేకమంది ధారాళముగా విరాళములను పంపించారు.

ఐదు సంవత్సరాల వ్యవధిలో మొత్తం 2,50,000 డాలర్లు సమకూడగా అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రములోనున్న ఫిలదెల్ఫియాలో వారు కొనిన విశాలమైన స్థలములో ఒక పెద్ద చర్చి భవనం నిర్మించబడినది. దానిలో 3,300 మంది కూర్చోవచ్చును. అది ప్రస్తుతము టెంపుల్ బాప్టిస్టు సంఘముగా పిలువబడుచున్నది. ఆ ప్రక్కనే కొన్ని వందల మంది పిల్లలు పట్టగల ఒక సండేస్కూలు భవనము కూడా నిర్మించబడింది. అంతేకాక నేడు అనేక వేల మందికి వైద్య సదుపాయాన్ని అందించుచున్న గుడ్ సమారిటన్ హాస్పిటల్ కూడా ఆ స్థలములోనే కట్టబడింది. ఇంకా అది దినదినాభివృద్ధి చెంది, నేడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన టెంపుల్ యూనివర్సిటీ కూడా అదే స్థలములో ఏర్పాటు చేయబడింది.

చూశారా పిల్లలూ! ఆ చిన్నపాప ఆసక్తి ఏమిటంటే సండేస్కూలు బిల్డింగ్ కోసం తన పేదరికంలో కూడా డబ్బును పొదుపు చేసింది. ఆమె త్యాగం తను చనిపోయినా సరే బిల్డింగ్ కట్టడానికి సహాయపడింది. మన ప్రభువు మనకు ఎంతో మాదిరిని చూపారు. ప్రేమ, త్యాగం, కరుణ, దయ ఈ గుణలక్షణములను మనము కూడా కలిగి ఉంటే దేవునికి ఇష్టులుగా జీవించగలము. ఉన్నతమైన ఆశయాలతో మీ చిన్ననాటి నుండి మీరు జీవితంలో ఆసక్తి కలిగి ఉండాలని ఆశిస్తూ…

ప్రేమతో
మీ అక్కయ్య

# నా జీవితములో దేవుని మేలులు

**శ్రీను. నర్సాపురం**

దేవుని నామమునకు స్తోత్రములు, మీ అందరికి నా హృదయపూర్వక వందనములు. నా పేరు శ్రీనివాస్, మాది పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం దగ్గర గొంది అనే గ్రామము. మా తల్లిదండ్రులకు మేము ముగ్గురు సంతానము, ఇద్దరు అక్కలు, నేను. మాది విగ్రాహారాధన కుటుంబము. నా తల్లిదండ్రులు కూలిపని చేస్తూ కుటుంబమును నడిపించేవారు. ఆర్థికస్థోమత లేక అక్క వాళ్ళిద్దరిని చదివించలేదు. నన్ను మాత్రము ఎలాగైనా చదివించాలనే ఆశతో వారు కష్టపడి M.B.A వరకు చదివించారు.

మా నాయనమ్మ యేసుప్రభువుని విశ్వసించడం వలన మా చిన్నతనంలో మమ్మల్ని చర్చికి తీసుకుని వెళ్ళేది. నేను కూడా చాక్లెట్స్, బిస్కెట్స్ ఇస్తారు అని ఆశతో వెళ్తూ ఉండేవాడిని కానీ ఆసక్తితో వెళ్ళేవాడిని కాదు. అలా నా యౌవనకాలంలోకి వచ్చేసరికి, యేసుక్రీస్తుని గురించి నా మనస్సులో సంకుచిత భావం కలిగి ఉండి, అప్పటి నుండి చర్చికి వెళ్ళకుండా విగ్రహారాధనని చాలా ఇంట్రస్ట్‌గా చేసేవాడిని. ఉపవాసములు ఉంటూ, గుళ్ళకు వెళ్తూ, చాలా నిష్టగా పూజించేవాడిని. అప్పటికే మా పెద్దక్క వివాహం జరిగి, ఆమె కుటుంబ సమస్యలతో బాధపడుతుండగా, యేసుప్రభువును గురించి కొందరు చెప్పిన మాటల వలన ఆమె చర్చికి వెళ్తూ ఉండేది. దేవుడు ఆమె జీవితంలో మేలు చేయుట వలన ఆమె రక్షణ పొందింది. మా అమ్మగారు కూడా దేవునిని నమ్మి ప్రార్థన చేసుకునేవారు.

నా చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం నిమిత్తం 2012లో హైదరాబాద్‌కి వచ్చాను. మేము రూమ్‌లో ఐదుగురు ఫ్రెండ్స్ ఉండేవాళ్ళము, అందులో ఇద్దరు క్రిస్టియన్స్. నేను జాబ్ వెతుక్కుంటూ, వాళ్ళు చర్చ్‌కి వెళ్తున్నప్పుడు ఖాళీగానే ఉంటున్నాను కదా అని నేను కూడా వాళ్ళతో కలసి చర్చ్‌కి వెళ్తూ ఉండేవాడిని. దానికి కారణం మా అమ్మ, అక్క. అలాగే నాకు మా బంధువులలోని అమ్మాయితో వివాహం కూడా నిశ్చయించడం జరిగింది. తన పేరు తులసి. ఆమె ప్రార్థన చేసుకునేది, చర్చికి వెళ్ళేది. ఆమె ప్రతిరోజూ నన్ను అడుగుతూ ఉండేది, నాతో పూజలు చేయించరు కదా! చర్చికి పంపిస్తారు కదా! అని. అప్పుడు నేను ఇద్దరమూ ఒక్కటే దారిలో వెళ్తే బావుంటుంది కదా అన్న ఆలోచనతో చర్చికి వెళ్తూ ఉండేవాడిని. నేను చర్చ్‌కి వెళ్తున్నానని తెలిసి మా బంధువులు హేళనగా మాట్లాడేవారు. ఆ విషయమై మా అమ్మకి చెప్పినప్పుడు ఆమె నవ్వి వారి మాటలను పట్టించుకోవద్దు, మనం దేవున్ని విడిచిపెట్టవద్దు, ఎవరూ మనకు ఏమీ చెయ్యరు అని నాకు ధైర్యం చెప్పేది. అలా దేవుని మందిరమునకు వెళ్తూ మారు మనస్సు పొంది 2013 మే 26న మా అమ్మగారు నేను ఒకేసారి రక్షణ పొందాము.

నాకు జాబ్ కోసం మా అమ్మగారు అక్కడ ఉన్న పాస్టర్‌గారితో మాట్లాడింది. అప్పుడు ఆయన చింతల్ పరిచర్యలో ఉండే ఒక సహోదరునితో ఫోన్‌చేసి మాట్లాడారు. వెంటనే ఆ అన్న నాతో మాట్లాడి శుక్రవారం జరిగే విజ్ఞాపన ప్రార్థనకు నన్ను తీసుకువచ్చారు. ఆ రోజు వాక్యం విన్న తర్వాత నా హృదయంలో సంతృప్తిగా అనిపించింది. సంతోషంతో తిరిగి రూమ్ కి వెళ్ళాను. ఆ రోజు నుండి క్రమంగా ప్రార్థనకు వచ్చేవాడిని. చర్చ్‌లో సహోదరులతో మాట్లాడుతున్నప్పుడు ఆనందంగా ఉండేది. నాకు కోపం చాలా ఎక్కువ ఉండేది. వాక్యము లు వింటుండగా, చర్చ్‌లో సహోదరులతో మాట్లాడుతూ ఉంటుండగా నాలో కోపం క్రమం గా తగ్గింది.

అలాగు మందిరమునకు వస్తుండగా నా వివాహ విషయం దైవసేవకులకు చెప్పి పరిచర్యలో జరిగించబడాలని కోరినప్పుడు సేవకులు అంగీకరించి 2013 డిసెంబర్‌లో మా వివాహం జరిపించారు. మా వివాహం అయ్యేసరికి మా ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉండేది. అయితే వింటున్న వాక్యములను బట్టి దేవుని మీదనే ఆధారపడేవారము. ఆ విధంగా మా అవసరతలన్నింటిలో ఆయనే తోడుగా ఉండి ఏది తక్కువ కాకుండా నడిపించారు. నాకు కుమారుడు, కుమార్తె. వాళ్ళు పుట్టిన తర్వాత నా భార్యకు నడుము నొప్పి ఎక్కువగా వచ్చేది. ఇంగ్లీషు మందులు, ఆయుర్వేదిక్ మందులు వాడినప్పటికీ తగ్గలేదు. ఒకరోజు సేవకులకు చెప్పినప్పుడు భయపడకమ్మ తగ్గుతుంది అని చెప్పారు. ఆ మాటను దేవుని మాటగా మేము నమ్మి విశ్వసించినప్పుడు దేవుడు అద్భుతంగా స్వస్థపరిచారు. మా నాన్న గారికి దేవుని మంచితనము గురించి, మా జీవితంలో దేవుని కార్యములను గురించి చెప్తుండేవాళ్ళము. అలాగున ఆయన కూడా మనస్సు మారి రక్షించబడ్డారు.

ఆ విధంగా మా జీవితములో ఎప్పటికీ ఏది అవసరమో అది అనుగ్రహిస్తూ, ఆత్మీయంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా ఆయన కృపను మాకు అనుగ్రహిస్తూ ప్రతి క్షణం మాకు తోడై ఉండి నడిపిస్తున్నారు. అలాగే పరిస్థితులు ఎలా ఉన్నా ఆయన అనుమతించిన దానిని అంగీకరించి ముందుకు సాగిపోవాలనే మనసునిచ్చి నడిపిస్తున్న దేవునికి స్తోత్రములు. పరిచర్యలో సహోదరులు చూపించే ప్రేమ, శ్రద్ధ మాకు చాలా ఆనందమును కలిగి జీవించునట్లుగా చేస్తున్నాయి. నేను, నా కుటుంబము మా బ్రతుకు దినములన్నియు దేవుని సన్నిధిలో నిలిచి ఉండాలని, దేవునికి మహిమకరంగా జీవించాలని మా కొరకు ప్రార్థించగలరు.

# హతసాక్షులు

## జోసఫ్ మరియు మైకెల్ హోఫర్

**1918లో కాన్‌సాస్ అమెరికాలో మరణించాడు.**

జేకబ్ వైప్ మరియు ముగ్గురు సహోదరులు డేవిడ్, జోసఫ్, మైకెల్ హోఫర్ వీళ్ళందరూ దక్షిణ డకోటాలో ఉన్న హుటిరైటు రాక్‌పోర్ట్ కాలనీ సభ్యులు. మే 25, 1918వ సం॥ యుద్ధము చేయుటకు పిలువబడ్డారు. వీరందరు కూడా 30 సంవత్సరములు లేక తక్కువ వయస్సు కలిగిన వారు. వీరి భార్యలు, బిడ్డలు గృహములలో ఉన్నారు. వారి కుటుంబముల కు పోషణ జరిగించేవారు వీరేనా అని డ్రాఫ్టు బోర్డు వారు అడిగినప్పుడు 'లేదు' అని జవాబు ఇచ్చారు. ఎందుకనిన వారు ఒకవేళ యుద్ధమునకు వెళ్ళినచో వారి సంఘము వారి కుటుంబములకు సహాయము చేస్తుంది అని నమ్మారు గనుక. ఈ విధముగా జవాబు చెప్పుట ద్వారా యుద్ధములో చేరకుండా తప్పించుకునే కొద్ది తరుణమును కూడా పోగొట్టుకొన్నారు.

ఈ నలుగురు కూడ కలిసి ఒకటిగా జీవించుచున్న వారి గృహము నుండి మురికి రోడ్డుపై ప్రయాణము చేసి, దగ్గరలో ఉన్న అలెగ్జాండ్రియ పట్టణము చేరుకున్నారు. అక్కడ వేలకొలది మంది వారి తోటివారు యుద్ధమునకు పోనైయున్న వీరిని ప్రోత్సహించుటకు, అభినందించుటకు కూడుకొని ఉన్నారు. రాక్‌పోర్టు కాలనీ నుండి వచ్చిన ఈ నలుగురు హ్యుటిరైటు సోదరులు ఆ స్థలములో కలుసుకొనిన వాళ్ల స్నేహితుడు ఆండ్రూ ఊడ్స్ వీరు మిగతా యవ్వనస్తులకన్నా వేరుగా కనిపించారు. వీరు నల్లని వస్త్రములు ధరించి, గడ్డములు పెంచుకొనియున్నారు. ఇది శాంతియుతమైన దేవుని రాజ్యముగా నివసించుటకు సూచనగా ఉన్నది. వారి పాస్టరు మరియు కుటుంబ సభ్యులు వారికి ఈ విధముగా చెప్పారు. యుద్ధ శిబిరమునకు వెళ్ళండి కానీ, యుద్ధము చేయుటకు ముందుకు సాగే పనులు ఏమి చెయ్యవద్దని చెప్పారు. యుద్ధపనులలో పాలుపుచ్చుకొనుట అనునది శత్రువులను ప్రేమించు, హింసను త్రోసిపుచ్చు అని క్రీస్తు చెప్పిన బోధను నిరాకరించుట అవుతుంది గనుక.

యుద్ధ సమయములో దేశభక్తి కనుపరచవలసిన పరిస్థితిలో పైన చెప్పబడిన బోధ ఎక్కువ శత్రుత్వమునకు గురి చేసినది. దగ్గరలో ఉన్నటువంటి లిబర్టీ లోన్ కమిటీ వారు హాన్‌సన్ కౌంటికి చెందినవారు. యుద్ధములో చేరు పత్రములను కొనుటకు నిరాకరించినందు వలన హ్యుటిరైటు వారు నివాసము ఏర్పరచుకొనిన స్థలము నుండి, వంద ఆవు దూడలను, వేలకొలది గొఱ్ఱెలను అక్రమముగా దొంగిలించారు. మరియు మే 25, 1918 దక్షిణ డకోటా క్యాంపు నుండి వాషింగ్‌టన్‌కు చెందిన లూయిస్‌లో ఉన్న శిబిరమునకు తరలివెళ్ళారు. దక్షిణ డకోటా డిఫెన్స్ కౌన్సిలు జర్మను భాష మాట్లాడటము నిషేధించారు. అది ఆ రాష్ట్రములో శత్రువుల భాషై ఉన్నది. హ్యుటిరైటు వారు, జర్మను భాషలో ఆరాధించి

మరియు జర్మను భాషలో నేర్పించబడిన వారు, వీరు ఈ శాసనమునకు గురి అయ్యారు.

ఈ విషయములన్నీ తెలిసిన వారైన హోఫర్ సోదరులు, జేకబ్ వైప్ క్యాంప్ లూయిస్‌కు వెళ్ళుటకు రైలులో ఎక్కినప్పుడు కొంత జాగ్రత్తగా ఉన్నారు. వారి మనస్సులలో ఈ విధము గా తలుస్తున్నారు. వాళ్లు శిబిరమునకు చేరిన వెంటనే వారి విశ్వాసమును గురించి సాక్ష్యమి చ్చి, వారు సైనికులుగా పనిచేయుటకు నిరాకరించుటనుగూర్చి తలంచుచున్నారు. అమెరికా విధానము ప్రకారము వాళ్ళు యుద్ధములో చేరుటకు పత్రములు అంగీకరించిన సమయము నుండి మామూలు పౌరుల హక్కు పోయింది. వారు పడమరవైపు ప్రయాణము చేయుచున్న పదిహేను బోగీలు ఉన్న రైలులో ఆ నలుగురు వ్యక్తులను ఒక బోగీ నుండి ఇంకొక బోగీకి మార్చడం జరిగింది. ప్రతి బోగీలో కూడా వీరు శాంతికాముకులు, జర్మను భాష మాట్లాడు వారు అని తెలియుటనుబట్టి వారిని వేధించసాగారు. తుదకు కండక్టరు వాళ్లు నలుగురు వేరుగా ప్రయాణము చేయులాగున ఒక చిన్న బోగీలో వారిని ఉంచాడు.

కొంతమంది తోటి సహోదరులు హ్యూటిరైట్స్‌తో మాట్లాడాలనుకున్నారు. వారిలో ఇద్దరు హ్యూటిరైట్స్‌కు తెలిసినవారు. ఎందుకనిన వారి స్వంత ఊరి నుండి వీరిద్దరు కూడా వచ్చిన వారు. వారు విలియం డెనోఫోర్తు మరియు జేమ్స్ ఆల్‌బర్ట్ మౌంటుగోమెరి, హ్యూటిరైట్స్ ముందు తలుపు తెరుచుటకు నిరాకరించారు. కానీ చివరకు తలుపు తెరచినప్పుడు, చాలా మంది ఆ బోగీలోకి ప్రవేశించి 'ఉచితంగా మంగలిపని' చేస్తాము అని చెప్పారు. హ్యూటిరైట్స్ ను ఆ బోగి నుండి బలవంతంగా లాగివేసి, వారి గడ్డములు కత్తిరించి మరియు వారి తల వెంట్రుకలు కూడా కత్తిరించారు. ఆ రైలుబండి చివరకు వాషింగ్‌టన్ చేరుకొన్నది. డెభైవేల ఎకరముల విస్తీర్ణము కలిగిన క్యాంప్ లూయిస్‌నకు చాలామంది సైన్యములో చేరిన వారు వస్తూ ఉండేవారు. మే 28 హోఫర్ సోదరులు మరియు జేకబ్ వైప్ ఈ కాకీ నగరములోకి ప్రవేశించారు. అక్కడ వేలకొలది యువకులు తర్ఫీదు పొందుతున్నారు. చాలామంది కాల్బలముగా ఐరోపా వెళ్ళుటకుగాను తర్ఫీదు పొందుతున్నారు.

వారు అక్కడ చేరిన వెంటనే వరుస క్రమములో నిలువబడమని చెప్పబడ్డారు. వారు సైన్యములో చేరినట్లు నిర్ధారణ పత్రములు మరియు వారికి కేటాయించనైయున్న పని యొక్క నిర్ధారణ పత్రములను స్వీకరించుటకై, క్రమములో నిలువబడమని ఆదేశించారు. హూటిరైట్స్ ఆ విధముగా నిలవబడినచో యుయస్ సైన్యములో చేరినట్లు అవుతుందని వారు నిలువబడుటకు నిరాకరించారు. వారు 'సైనికులుగా స్థిరపడే కార్డులను' నింపుటకు నిరాకరించారు. అక్కడ ఉన్న అధికారులు వారిని ఒప్పించుటకు ప్రయత్నము చేశారు కానీ వారు వినలేదు. అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ మరియు యుద్ధ కార్యదర్శి న్యూటన్ బేకర్ ప్రతి ఒక్కరు వారి బాధ్యతను నిర్వర్తించాలని ఆఖరికి వంటగదిలో కూడ తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. కానీ హ్యూటిరైట్స్ క్యాంపు జీవితములో పాల్గొనుటకు నిరాకరించి

నందువలన వారిని తాళం వేసి బంధించడం తప్ప వేరు మార్గము లేదని తలంచారు. ఆ క్యాంపు లూయిస్‌లో ఉన్న వారందరు యుద్ధమునకు తర్ఫీదు పొందుచుండగా, హ్యూటిరైట్స్ బంధింపబడి తీర్పుకొరకు వేచియున్నారు.

గార్డు హవుసు నుండి డేవిడ్ హోఫర్ తన భార్య అన్నాకు ఈ విధముగా వ్రాశాడు.

మేము ఎక్కడ ఉన్నాము అని నీవు తలంచినట్లయితే ఇంటి నుండి దూరముగా భార్య బిడ్డలకు దూరముగా అంతేకాకుండా మేము ఉన్న క్లిష్టపరిస్థితిని గూర్చి చెప్పలేదు. మేము అనేక విషయములచే సవాలు చెయ్యబడ్డాము. కానీ దేవుని సహాయముతో ఆయనకు నమ్మకముగా ఉండగలుగుతున్నాము. మా వాగ్దానమును విడిచిపెట్టకయున్నాము. అది మా శరీరములను, జీవితములను బలిగొనవచ్చు. మన ప్రియమైన ప్రభువు మత్తయి సువార్తలో చెప్పబడినట్లు 'నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు... ఇలాంటి వారిదే పరలోక రాజ్యము'. ఈ కొద్ది మాటలతో నేను ముగించుచున్నాను. మరియు ఏమి వ్రాస్తున్నామో జాగ్రత్తగా ఉండాలి. వ్రాయాలి అనుకున్ననన్నిసార్లు వ్రాయలేము. మేము విచారణ నిమిత్తమై 5నుండి 20 సంవత్సరములకు జైలులో ఉంచబడ్డాము అని వ్రాశాడు.

హ్యూటిరైట్స్ ఆజ్ఞను ధిక్కరిస్తున్నారని అధికారులు వారిని నిందించారు. తద్వారా యుద్ధ నియమములను ఉల్లంఘిస్తున్నారని తప్పుపట్టారు. వారు వరుసలో నిలువబడి, పూరించవలసిన పత్రములను పూరించుట ఏ విధముగా విఫలమైనదో చెప్పారు. మొట్ట మొదట విచారింపబడిన వ్యక్తి జేకబ్ వైప్, ఇతను ఎక్కడకు ప్రయాణము చేసి ఉండలేదు. అతని మాతృభాష జర్మను, కొంచెమే విద్యనభ్యసించిన వాడు, ఇతను కొంతమంది అధికారులకు జవాబు చెప్పవలసి వచ్చింది. వీరు ఎందుకు సైన్యములో చేరుటకు నిరాకరిస్తున్నారో తెలుసుకోవాలనుకున్నారు.

**సేకరించబడింది**

**ఇంకా ఉంది**

# మనస్తత్వపు విధానములు

## కృతజ్ఞత మనస్సు

(గతి సంచిక తరువాయి భగం)

**"అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము. ఎలాగనగా మనుష్యులు స్వార్ధ ప్రియులు ధనాపేక్షులు బింకములాడువారు అహంకారులు దూషకులు తల్లిదండ్రులకు అవిధేయులు కృతజ్ఞత లేనివారు అపవిత్రులు". 2తిమోతి 3:1,2**

అపాయకరమైన కాలములు రావటానికి కారణము కృతజ్ఞత లేని మనుష్యులు. అందుకే అంత్య దినములలో అపాయకరమైన కాలములు వచ్చునని పౌలు తిమోతితో చెప్తున్నాడు.

**"వారిలో చిన్నవాడు తండ్రీ, ఆస్తిలో నాకు వచ్చు భాగమిమ్మని తన తండ్రినడుగగా, అతడు వారికి తన ఆస్తిని పంచిపెట్టెను". లూకా 15:12**

తండ్రి మరియు ఇద్దరు కొడుకులు ఉన్నారు. చిన్నవాడు తన తండ్రి కష్టపడి సంపాదించిన ఆస్తిని ఇవ్వమని అడుగుతున్నాడు. కొంతమంది తల్లిదండ్రులను ఏ విధంగా ఉపయోగించుకోవాలా అని చూస్తారు. వారు తల్లిదండ్రులను అవసరానికి వాడుకొని కృతజ్ఞత లేకుండా జీవిస్తారు. వివాహం అయినవారు మీ తల్లిదండ్రులపట్ల ఎంత కృతజ్ఞత కలిగి ఉన్నారు? మీ పిల్లలకి మీ తల్లిదండ్రులపట్ల ఎంత కృతజ్ఞతాభావాన్ని పెంపొందింప చేస్తున్నారు? నీ తల్లిదండ్రులు కష్టపడి నిన్ను పెంచిన విధానాన్ని నీ పిల్లలతో పంచుకో. వారికి ఇతరులపట్ల కృతజ్ఞత కలిగే మాటలు చెప్పటం వలన వారు పెరిగి పెద్దవారు అయ్యాక కృతజ్ఞతగా బ్రతకటం నేర్చుకొంటారు. ఆ చిన్న కుమారుడు ఆస్తిలో నా భాగము నాకు ఇస్తే నేను వెళ్లిపోతాను అంటున్నాడు. అతను సంపాదించలేదు కాబట్టి అతనికి దాని విలువ తెలియదు కనుక తండ్రి ప్రేమతో ఆస్తిలో అతనికి భాగము ఇస్తే దానిని ఇష్టానుసారముగా ఖర్చు పెట్టి చివరికి తినడానికి తిండి కూడా లేకుండా అయిపోయాడు. అదే కృతజ్ఞత కలిగి ఉన్నవాడైతే ఆ ఇంట్లో ఉండటం నాకు ఇష్టము లేదు కాబట్టి నేను కష్టపడి బ్రతుకుతాను అనుకొనేవాడు. కానీ అతనికి కృతజ్ఞత లేకపోవటం వలన తినడానికి పందులు తినే పొట్టు కూడా లేకుండా పోయింది. పరిస్థితులన్నీ ఎప్పుడూ ఒకే విధంగా ఉంటాయి అనుకోకండి. నీ జీవితానికి పైనుండి దేవుడు దయ, కరుణ, కృప ఉండాలి, అవన్నీ ఉండాలంటే నీకు ఉండాల్సింది కృతజ్ఞత. ఆ చిన్న కుమారుడు అత్యంత శ్రేష్టమైన, సమృద్ధి అయిన తండ్రి ఇంటిని విడిచిపెట్టాడు కాబట్టి అతను ఇలా అనుకొంటున్నాడు. అయ్యో! నా తండ్రి ఇంటిలో కూలివానికి కూడా ఎంతో సమృద్ధి ఉన్నది కనుక నేను కుమారునిగా కాదు గానీ నేను పోయి కూలివానిగా ఉంటానని అనుకొన్నాడు. పిల్లలు తల్లిదండ్రులపట్ల కృతజ్ఞత కలిగి ఉండకపోతే చాలా ప్రమాదకరం.

**"అయితే పానదాయకుల అధిపతి యోసేపును జ్ఞాపకము చేసికొనక అతని మరచి పోయెను".ఆది 40:20**

యోసేపు అతనితోపాటు ఇద్దరు వ్యక్తులు చెరసాలలో ఉండగా, వారిలో ఆ ఇద్దరికి ఒక కల వచ్చింది. వారికి వచ్చిన కల భావం అర్థం కాక వారు యోసేపును అడిగారు. అప్పుడు యోసేపు పానదాయకుల అధిపతి అనబడే వ్యక్తితో నువ్వు విడిపించబడతావు మరల నీ ఉద్యోగం నీకు ఇవ్వబడుతుంది అని, ఇంకొకరితో నీకు మరణ శిక్ష విధించబడుతుంది అని కల భావం చెప్పాడు. యోసేపు పానదాయకుల అధిపతితో నీకు కల యొక్క భావం తెలియ జేశాను కాబట్టి నన్ను జ్ఞాపకముంచుకొని రాజు గారితో అన్యాయంగా చెరశాలలో వేయబ డ్డానని సిఫార్సు చేయమన్నాడు. యోసేపు చెప్పినట్లు అతని ఉద్యోగం అతనికి రాగానే యోసేపును మాత్రం మరచిపోయాడు. చేసిన మేలును మరచిపోయినవాడే కృతజ్ఞత లేని వాడు. మనము ఎవరి ద్వారా మేలు పొందామో వారు చేసిన మేలును మరచిపోకూడదు. చదువులో, ఉద్యోగంలో, వ్యాపారంలో నీ తోటివాడైనా చేసిన మేలు మరచిపోకూడదు. కృతజ్ఞత లేని మనస్సు ఏమి నేర్పిస్తుందంటే ఆ సమయానికి అవసరమైన వారిని వాడుకొని తరువాత మరిచిపోవటం నేర్పిస్తుంది. ఇది సాతాను నేర్పించేది. అటువంటి వారు అందరికి ఉన్నత స్థానంలో ఉన్నట్లు కనిపిస్తారు కానీ వారు ఎక్కడో దిగజారి అట్టడుగు స్థానంలో ఉన్నట్లు వారికి మాత్రమే తెలుసు. వారికి నిద్రపట్టదు, మనశ్శాంతి ఉండదు ఇలా అనేకమైన సమస్యలు. యోసేపు నన్ను జ్ఞాపకము చేసుకోమని అడిగినప్పటికీ కూడా పానదాయకుల అధిపతి అతనిని మరచిపోయాడు.

నీ ప్రతి అడుగులో నీ జీవితానికి మేలు చేసిన వ్యక్తిని మరువకుండా బ్రతుకు. ఆ విధంగా చేయటం మనకు మనమే మేలు చేసుకోవటం. నీకు మేలు చేసిన వ్యక్తి ఇంకా అనేక మందికి మేలు చేసిన వ్యక్తి అయివుండవచ్చు. నీకు చేసిన మేలును వారు జ్ఞాపకం ఉంచు కొనకపో వచ్చు గానీ నువ్వు మాత్రం దానిని మరచిపోకూడదు. మనకు మేలు చేసిన వారిని దేవుడే ఆశీర్వదిస్తాడు.

# దైవ చిత్తాన్వేషణ

**-యౌవనుల ప్రత్యేకము (సేకరించబడింది)**

**గడచిన సంచిక తరువాయి భాగం**

"క్రైస్తవ ప్రవర్తనంతటికీ ముఖ్య కారణం **'జీవము'** అని మనము తెలుకున్నట్లయితే, ఆ తరువాత కేవలం చెడును మాత్రమే విసర్జించుట కాదు, బయటకు మంచిగా కనబడే దానిని కూడా వదలివేయాలని తెలుసుకుంటావు. కేవలము క్రైస్తవ జీవితము (క్రీస్తు జీవము) నుండి వచ్చినది మాత్రమే క్రైస్తవ ప్రవర్తన; కాబట్టి జీవము నుండి రాని ఏ పనికైననూ మనము సమ్మతించకూడదు..... మనుష్యుల ప్రమాణాల ప్రకారము చాలా విషయాలు మంచిగానే కనబడతాయి కాని దేవుని ప్రమాణాలు వాటిని తప్పుగా చూపిస్తాయి. ఎందుకంటే, వాటిలో దేవుని జీవము లేదు. దేవుని మార్గాలు బాహ్యమైన సూచనలను బట్టి కాదు గాని అంతరంగ గురుతులను బట్టి మనకు తెలుస్తాయి. క్రైస్తవుని యొక్క మార్గమును సూచించేవి ఆత్మలోని సంతోషము మరియు సమాధానము. విశ్వాసిలో యేసుప్రభువు జీవిస్తున్నాడనేది సత్యము మరియు ఆయన మనలో తనకు తానే ఎల్లప్పుడూ వ్యక్తపరచుకుంటున్నాడు. కనుక ఆయన జీవమునకు మనము స్పర్శ కలిగియుండి, ఆ జీవము ఏమి చెప్పుచున్నదో వివేచించుటకు మనము నేర్చుకోవాలి".

ఈ పాఠము నేర్చుకొనుటకు దేవుడు మనకు సహాయము చేయును గాక.

**సారాంశము**

1. వింతైన మార్గములలో దేవుడు మనలను అరుదుగా నడిపించును. ఈ క్రొత్త నిబంధన యుగంలో దేవుడు మనలను పరిశుద్ధాత్మ ద్వారా నడిపించును. కనుక పరిశుద్ధాత్మతో నింపబడుటకు మనము చూడవలెను.

2. మన ఆత్మలలో అంతరంగ ఒత్తిడి ద్వారా పరిశుద్ధాత్ముడు మాట్లాడతాడు. ప్రార్థనలో దేవునికొరకు ఎదురు చూచే కొలదీ ఆ ఒత్తిడి పెరుగుతుంది మరియు దానితోపాటు అంతరంగములో సమాధానము పెరుగుతూ ఉంటుంది.

3. ఆత్మ స్వరము, ఇతర స్వరముల మధ్య గల బేధమును గమనించుటకు, మన ఉద్దేశ్యము లను పరీక్షించుకొని అవి పవిత్రముగా ఉన్నాయో లేవో చూచుకోవాలి.

4. ఒక కార్యమును చేయాలని మనము అనుకున్నప్పుడు దాని గూర్చిన లాభ, నష్టాల **'బ్యాలెన్స్ షీట్'**ను మనము తయారు చేసుకోవాలి. మనము దేవుని చిత్తమును తెలుసుకొను టకు ఇది సహాయపడుతుంది.

 **ఇష్టంతో చేసే పని శక్తిని పెంచుతుంది కానీ కష్టంతో చేసే పని శక్తిని తగ్గిస్తుంది.**

5. పరిశుద్ధాత్మ యొక్క అంతరంగ సాక్ష్యమునకు మనము ఎంతో ప్రాముఖ్యతను ఇవ్వాలి. ఎందుకనగా, ఈనాడు మనలను నడిపించుటకు దేవుని యొక్క ముఖ్య సాధనం ఇదే. కేవలం నైతిక నియమావళిని బట్టి కాక పరిశుద్ధాత్మ యొక్క అంతరంగ సాక్ష్యమును బట్టి మనము నడిపించబడాలని దేవుడు కోరుకుంటున్నాడు.

## బాహ్య సాధనముల ద్వారా నడిపింపు

మనము ఆయన నడిపింపు కోసం ఎదురు చూస్తున్నప్పుడు, పరిశుద్ధాత్ముడు మన ఆత్మలతో ఈ క్రింది సాధనముల ద్వారా కూడా మాట్లాడతాడు.

1. బైబిల్ యొక్క ఉపదేశము

2. పరిస్థితుల ద్వారా సూచన

3. ఇతర విశ్వాసుల సలహాలు

మనము దైవచిత్తమును నిర్ధిష్టముగా గ్రహించినట్లయితే, ఈ బాహ్య సాధనాల ద్వారా మన అంతరాత్మతో పరిశుద్ధాత్ముడు సాక్ష్యమిస్తాడు.

## బైబిల్ యొక్క ఉపదేశము

ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుట కును బైబిల్ మనకు ఇవ్వబడింది (2తిమోతి 3:16,17). అనేక విషయములలో, దేవుని చిత్తము ఇప్పటికే అందులో తెలియబడినది. ఉదాహరణకు, నీవు ఒక అవిశ్వాసిని (నామకా ర్థపు క్రైస్తవులైనా మరియు క్రమముగా సంఘమునకు వెళ్ళుచున్నప్పటికీ) వివాహము కొరకు చూస్తున్నట్లయితే దేవుని యొక్క వాక్యము స్పష్టంగా ఉన్నది. మీరు అవిశ్వాసులతో జోడుగా (వివాహమునకు సాదృశ్యము) ఉండకుడి-వారితో పొత్తు పెట్టుకొనకుడి (2 కొరింథీ 6:14)

**సేకరించబడింది**

**ఇంకా ఉంది.**

# Findig God's Will

**-Youth Special (sourced)**

"Once you realize that the determining factor in all Christian conduct is life, then you know that you must not only avoid all that is evil, but also all that is just externally good. Only what issues from the Christian life is Christian conduct; therefore we cannot consent to any action that does not spring from life.... Many things are right according to human standards, but the Divine standard pronounces them wrong because they lack the Divine life.... God's way for us is not known by external indications but by internal registrations. It is peace and joy in the spirit that indicate the Christian's path. It is a fact that the Lord Jesus Christ dwells within the believer, and He is constantly expressing Himself in us, so we must become sensitive to His life and learn to discern what that life is saying."

May God help us to learn this lesson.

## Summary

God rarely guides us in spectacular ways. In this New Testament age, God guides us through the Holy Spirit. So we must seek to be filled with the Holy Spirit.

The Holy Spirit speaks to us through an inner pressure in our spirits. This pressure increases as we wait on God in prayer, and will be accompanied by a growing inward peace.

To distinguish the voice of the Spirit from other voices, we should examine our motives and see that they are pure.

A 'balance sheet', to evaluate the advantages and disadvantages of a proposed course of action, can be helpful in enabling us to find God's will.

We must place great value on the inner witness of the Holy Spirit, for this is God's chief means of guidance in our day. God expects us to be governed by this in our daily lives and not merely by a moral code.

Guidance through external means

The Holy Spirit speaks to our spirits through the following external means also, when we are seeking His guidance:-

1. The teaching of the Bible.
2. The witness of circumstances.
3. The advice of other believers.

If we have ascertained the will of God accurately, the witness of the Holy Spirit through these external means will correspond with His inner witness within our spirits.

**The teaching of the Bible**

The Bible has been given that we might be instructed in correct doctrine and be led in the path of righteousness **(2 Tim. 3:16,17)**. In a number of matters, God's will is already clearly revealed therein.

For example, if you are considering marriage with an unbeliever (even a nominal Christian and a regular church-goer), the Word of God is explicit: "Do not be unequally yoked up (a symbol of marriage) with unbelievers - do not make mismatched alliances with them" **(2 Cor. 6:14)**

**To be continued....**




# బైబిల్ క్విజ్ -100

## 26-30 వ పుస్తకము వరకు ఇవ్వబడినవి.

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** ఏ ప్రవక్త కాలంలో భూకంపం సంభవించెను?

**2.** 'అది అన్నపానములు లేకపోవుటచేత కలుగు క్షామము కాదు' అని ఎవరు చెప్పారు?

**3.** ఏడు రోజులపాటు ఏమి చెప్పకుండా కదలకయు ప్రజల మధ్య కూర్చొన్న ప్రవక్త ఎవరు?

**4.** 'నేను నీకు శిక్ష విధింపబోవు కాలమున ఓర్చుకొనుటకు చాలినంత ధైర్యం నీ హృదయమునకు కలదా?' అని ఎవరు అడిగారు?

**5.** కరువు దేశములో నుండినను వారు తమ నీతిచేత తమ్మును మాత్రమే రక్షించుకొందురు అని ఎవరిని గూర్చి యెహోవా సెలవిచ్చెను?

**6.** తన బాణాలను అటుఇటు ఆడించి విగ్రహాలను సంప్రదించిన రాజు ఎవరు?

**7.** ఏ రాజు నడుము కీళ్ళు వదులై, మోకాళ్లు గడగడ వణుకుతు కొట్టుకున్నాయి?

**8.** వ్యభిచారము చేయు స్త్రీని భార్యగా చేసుకొమ్మని దేవుడు ఏ ప్రవక్తకు చెప్పాడు?

**9.** దేవుడు ఇశ్రాయేలు వారికి స్వస్థతను కలుగజేసినప్పుడు ఎవరి దోషం చెడుతనం బయలుపరచబడుతుంది?

**10.** "మత్తులారా, మేలుకొని కన్నీరు విడువుడి" ఈ మాట ఎవరు చెప్పారు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జూన్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జూలై 2025 పత్రికలో ప్రచురించబడతాయి.

పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ -99 జవాబులు(లూకా నుండి ఇవ్వబడింది)**

| | |
|---|---|
| **1.** యెషయా **30:1** | **2.** పరమగీతము **8:6** |
| **3.** ప్రసంగి **9:4** | **4.** యిర్మీయా **33:6** |
| **5.** పరమగీతము **2:2** | **6.** విలాప వాక్యము **2:19** |
| **7.** యిర్మీయా **39:18** | **8.** ప్రసంగి **10:18** |
| **9.** యెషయా **37:34** | **10.** విలాప వాక్యము **5:16** |

**బైబిల్ క్విజ్ - 99 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

ఉషారాణి (బి.హెచ్.ఇ.ఎల్), కె.దివ్య స్నేహిత, పాపరమేష్, ఆర్.ఐజాక్ కుమారి, కె.గ్లోరి, ఫ్లోరెన్స్, గణేష్

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

" నీ దేవుడైన యెహోవా కన్నులు
సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు
మీ జీవితముల మీద ఉండును గాక ! "

## మే - జూన్

ఎపఫ్రా మినిస్ట్రీస్ కుటుంబములో
మే, జూన్ నెలలో పుట్టిన వారందరికి
ఎపఫ్రా మినిస్ట్రీస్ తరుపున హృదయపూర్వకమైన
జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయుచున్నాము.

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227


2025, ఏప్రిల్ 18వ తేదీ జరిగిన గుడ్ ఫ్రైడే ఆరాధనలో పాల్గొనిన విశ్వాసులు.

2025, ఏప్రిల్ 18వ తేదీ జరిగిన
గుడ్ ఫ్రైడే ఆరాధనలో పాల్గొనిన విశ్వాసులు.



# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph : 040-24202227 Cell : 9666666249
email : mail2church@gmail.com | web : www.epaphra.org



Published by: T. Epaphras, Plot No.1, Shanti Nagar, Opp. Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-5000070, Hyderabad.
Printed by: Charisma Printers Pvt. Ltd, # 6-1-91/37-40, Sensation Theatre Road, Lakadi-ka-pool, Hyderabad (TS) 500004 | Editor: Bro. T.Epaphras